## మహిళా ఖైదీకి పరీక్షలు

### తిరిగి జైలుకు తరలింపు

ఎదులాపురం, జూన్ 17 : గాదిగూడ మండలంలో గజేందర్ అనే ఉపాధ్యాయుడి హత్యకేసులో అరెస్టు అయి ఆదిలాబాద్ జిల్లా జైలు లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయన భార్య విజయలక్ష్మి తాను బ్లేడు ముక్కలు మింగినట్లు తెలుపగా జైలు అధికారులు ఆమెను చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. జిల్లా జైలు సూపరింటెండెంట్ అశోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహిళా ఖైదీ ఆదివారం తనకు తినడానికి ఇబ్బందిగా ఉందని, కడుపునొప్పిగా ఉందని తెలిపింది. ఈ విషయంలో ఖైదీని జైలు అధికారులు ఆరా తీయగా తాను జైలుకు రాకముందు బ్లేడ్ ముక్కలు మింగినట్లు సూచించింది. దీంతో జైలు అధికారులు ఆమెను చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. ఖైదీకి పరీక్షలు నిర్వహించిన వైద్యులు అవసరమైన చికిత్స అందించారు. సోమవారం డిశ్చార్జి చేసి జైలుకు పంపించారని తెలిపారు. జైలులో ఎలాంటి బ్లేడు ముక్కలు మింగలేదని, కోసుకోవడం, హైడ్రామా జరగలేదని సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ తెలిపారు. మీడియాలో వచ్చిన వార్తలను ఆయన ఖండించారు.

## కేసీఆర్‌ను కలిసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే

ఎదులాపురం, జూన్ 17 : తెలంగాణ రాష్ట్ర మాజీ సీఎం కేసీఆర్‌ను సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కులు కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై కేసీఆర్‌తో చర్చించారు.



కేసీఆర్‌ను కలిసిన మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు



అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

# బాసర క్షేత్రం.. జన సంద్రం

- భక్తులతో కిక్కిరిసిన ఆలయం
- వరుస సెలవులతో భక్తుల తాకిడి
- అమ్మవారి దర్శానికి మూడు గంటల సమయం
- భారీగా అక్షరాభ్యాసాలు
- రూ.18 లక్షల ఆదాయం



అమ్మవారి సన్నిధిలో మహారాష్ట్ర మాజీ సీఎం, బీజేపీ రాజ్యసభ సభ్యుడు అశోక్‌రావు చౌహాన్



చిన్నారులకు అక్షరశ్రీకార పూజలు నిర్వహించుకుంటున్న భక్తులు

బాసర, జూన్ 17 : నిర్మల్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సరస్వతీ అమ్మవారు కొలువైన బాసర సోమవారం భక్తులమయం అయింది. వరుస సెలవుల దృష్ట్యా ఆలయానికి భక్తులు తాకిడి పెరిగింది. అదేవిధంగా ఏకాదశి కావడం, పాఠశాలలు పునఃప్రారంభం అవ్వడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా ఆయా రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారి సర్వదర్శన క్యూలైన్‌లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయం పరిసరాలు, బస్టాండ్, గోదావరి ప్రాంతం, రైల్వేస్టేషన్‌లు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారి దర్శనానికి సుమారు మూడు గంటలు పట్టింది. క్యూలో ఉన్న చిన్నపిల్లల కోసం మజ్జిగ, నీటిని ఆలయాధికారులు పంపిణీ చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. సుమారు 20 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు తమ పిల్లలకు అక్షరశ్రీకార పూజలు చేయించుకున్నారు. 1,620 మంది అక్షరాభ్యాసాలు చేయించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. సోమవారం ఆలయానికి రూ.18 లక్షల ఆదాయం వచ్చినట్లు ప్రకటనలో తెలిపారు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో శ్రీ స్వామి సమర్థ మహారాజ్ గురుపీఠం ఆధ్వర్యంలో సరస్వతీ పూజ, విద్యారంభ పూజలను నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర నుంచి భక్తులు అత్యధికంగా తరలి వస్తున్నారు. పూజల అనంతరం స్వామి సమర్థ మహారాజు శిష్యుడు అన్నాబావు మోరె భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, జడ్పీటీసీ వసంత, మండల ఎంపీపీ సునీత, బాసర మాజీ సర్పంచ్ డి. లక్ష్మణ్ రావు పాల్గొన్నారు.

### అమ్మవారిని దర్శించుకున్న మహారాష్ట్ర మాజీ సీఎం

బాసర సరస్వతీ అమ్మవారిని సోమవారం మహారాష్ట్ర మాజీ సీఎం, బీజేపీ రాజ్యసభ సభ్యుడు అశోక్‌రావు చౌహాన్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారిని అధికారులు ఘనంగా స్వాగతించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

# త్యాగానికి ప్రతీక బక్రీద్

### ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో సోమవారం ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గా మైదాన ప్రాంగణాలు కిక్కిరిసి కనిపించాయి. ముస్లిం మత పెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖురాన్‌ను చదివి వినిపించారు. ఆదిలాబాద్‌లో ఎస్పీ గౌష్ ఆలం సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. - నమస్తే నెట్‌వర్క్



ఎదులాపురం : సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం



భైంసా : ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



నేరడిగొండ : ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్



క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## గెలుపు ఓటములు సహజం

**బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్**

నేరడిగొండ, జూన్ 17 : క్రీడల్లో గెలుపు ఓటములు సహజమేనని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ క్రీడాకారులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన నేరడిగొండ ప్రీమియర్ లీగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో మెలగాలని సూచించారు. ఆటలతో క్రీడాకారుల్లో సత్సంబంధాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ పోటీల్లో సైనిక్ సిక్సర్ విజేతగా నిలువగా, రైజింగ్ రైడర్ రెండో స్థానంలో నిలిచింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మర్ రవీందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పాండురంగ్, నిర్వాహకులు పవన్‌కుమార్, లఖన్, యోగి, మణిరాజ్, హరీశ్, జాకీ, అనిల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి రాములు

## కార్మిక శాఖకు మంత్రిని కేటాయించాలి

**సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి రాములు**

ఎదులాపురం, జూన్ 17 : తెలంగాణ కార్మిక శాఖకు మంత్రిని కేటాయించి, వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గత ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా స్కీం వర్కర్లు, కార్మికులు, ఉద్యోగులు చేపట్టిన సమ్మెల సందర్భంగా ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఐదు నెలలుగా బిల్లులు విడుదల కాకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలపారు. పంచాయతీ కార్మికులకు ఆరు నెలల వేతనాలు అందడం లేదన్నారు. కార్మిక శాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించకపోవడం కార్మికుల ఉద్యోగులపై కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రదర్శిస్తుందన్నారు. వెంటనే కార్మిక శాఖ మంత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, కోశాధికారి సునీత, ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, అగ్గి మల్ల స్వామి, గంగన్న, సహాయ కార్యదర్శులు జితేందర్, వెంకటమ్మ, సునీత పాల్గొన్నారు.

# వానకాలమంటే వణుకే

### మారుమూల గ్రామాలకు మెరుగుపడని రవాణా వ్యవస్థ

- రోడ్లు, వంతెనలు లేక దశాబ్దాలుగా అష్టకష్టాలు
- చిన్నపాటి వర్షాలకే వాగులు ఉప్పొంగి రాకపోకలు బంద్
- రోజుల తరబడి బాహ్య ప్రపంచంతో సంబంధాలు కట్
- చెన్నూర్, బెలంపల్లి నియోజకవర్గాల్లో 80కిపైగా బ్రిడ్జిలు నిర్మించిన కేసీఆర్ సర్కారు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో ముందుకు కదలని అనేక నిర్మాణాలు

మంచిర్యాల, జూన్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : జిల్లాలోని మారుమూల గ్రామాల ప్రజలకు వర్షాకాలమంటేనే వణుకు. వాగులు.. వంకలు ఉప్పొంగి బాహ్యప్రపంచంతో రోజుల తరబడి సంబంధాలు తెగిపోతాయని వారి భయం. ఒక్కసారి భారీ వాన పడిందా ఇక దినదిన గండమే. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల వాసులంతా 'వానలు రావద్దు దేవుడా'.. అని కోరుకుంటుంటారు. దశాబ్దాలుగా అనేక గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన కేసీఆర్ సర్కారు రవాణా వ్యవస్థ మెరుగుపర్చాలని నిర్ణయించింది. ఈ మేరకు అనేక గ్రామాలకు రోడ్లు, వంతెనలు నిర్మించింది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల్లో 80కి పైగా వాగులు, వంకలపై బ్రిడ్జిలు నిర్మించడమేగాక మరికొన్ని గ్రామాలకు నిధులు కూడా మంజూరు చేసింది. అయితే అటవీ అనుమతులు లేక నిర్మాణాల్లో జాప్యం జరిగింది. ఇక ఆపై అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మారుమూల గ్రామాలకు రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించాలన్న విషయాన్నే పట్టించుకోవడం లేదు. దీంతో ఈ యేడాది కూడా ఆయా గ్రామాల ప్రజలకు తిప్పలు తప్పేలా లేవు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఇటీవల కోటపల్లి మండలం రాజారం గ్రామపంచాయతీ ప్రజలు పార్లమెంట్ ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చిన విషయం విదితమే. చివరకు అధికారులు దిగివచ్చి చర్చలు జరపడంతో వారంతా నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. నక్కలపల్లి గ్రామానికి రోడ్డు వేసేందుకు నిధులు మంజూరైనా అటవీశాఖ అనుమతులు లేక రోడ్డు, వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడం లేదు. ఇక పారుపల్లి-లింగన్నపేట గ్రామాల మధ్యనున్న వాగుపై రూ.3 కోట్ల 8 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతుండగా, నేటికీ పనులు పూర్తి చేయలేదు. దీంతో ఈ మార్గంలో ఉన్న 10 గ్రామాల ప్రజలకు కష్టాలు తప్పేలా లేవు.

### వర్షం వస్తే రాజారం ఊరికెళ్లడం కష్టమే

ఈ వర్షాకాలంలో కూడా రాజారం గ్రామస్తులకు కష్టాలు తప్పేలా లేవు. రాజారం గ్రామానికి రెండు మార్గాలుండగా, కేసీఆర్ ప్రభుత్వం పారుపల్లి నుంచి కావరకొత్తపల్లి గ్రామం వరకు ఉన్న 5 కిలో మీటర్ల రోడ్డుకు రూ.3 కోట్ల 3 లక్షలు, బబ్బెరచెలుక నుంచి రాజారం వరకు 3 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 2 కోట్ల 3 లక్షలు మంజూరు చేయించింది. కాగా, అటవీ అనుమతులు లేని కారణంగా ఈ రోడ్డు పనులు నిలిచిపోగా ప్రతి సంవత్సరం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం ఈ మార్గం మొత్తం బురదమయం అవుతుండడంతో కాలినడక కూడా కష్టం అవుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. 1125 మంది గ్రామస్తులు ఉండే ఈ గ్రామం పైన చిన్నచూపు చూస్తుండడం వల్ల తమకు వర్షాకాలంలో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయని చెబుతున్నారు. ఈ గ్రామంలోని విద్యార్థులు పై చదువులు చదవాలంటే ఊరికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బబ్బెరచెలుక గ్రామానికి కాలినడకన వెళ్లాల్సి వస్తుంది. ఈ మార్గంలో వాగు ఉండడం వల్ల, అది ఉప్పొంగినప్పుడల్లా ప్రాణాలకు తెగించి స్కూల్‌కు వెళ్లాల్సి వస్తున్నదని విద్యార్థులు చెబుతున్నారు.




కోటపల్లి మండలం పారుపల్లి-లింగన్నపేట గ్రామాల మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి పక్కన తాత్కాలిక రోడ్డు

### అటవీ అనుమతులే అడ్డంకి

కోటపల్లి మండలం నక్కలపల్లికి రోడ్డు నిర్మాణానికి అటవీ అనుమతులే ప్రధాన అడ్డంకిగా నిలిచాయి. మల్లంపేట నుంచి నక్కలపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.6 కోట్లు, మార్గమధ్యలో ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ. 2.95 కోట్లు, మరో బ్రిడ్జికి రూ.2 కోట్ల 3 లక్షలను కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేయగా, అటవీ అనుమతులు లేక రోడ్డు, బ్రిడ్జిల నిర్మాణం పడకేశాయి. గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న మట్టి రోడ్డు వర్షాకాలం బురదమయం కావడంతో వర్షాకాలం నక్కలపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాలతో పాటు బద్దంపల్లి, చాపనపల్లి, బొమ్మెన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. వర్షాలు పడితే ఈ మార్గంలో ఉన్న వాగులు ఉప్పొంగితే రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి ఎక్కడివారక్కడే ఉండాల్సి వస్తోంది. రోడ్డు, వాగుల పైన బ్రిడ్జిల నిర్మాణం పూర్తయితే ఈ మార్గంలో ఉన్న ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

### బ్రిడ్జి పూర్తికాకుంటే 11 గ్రామాలకు కష్టమే

కోటపల్లి మండలం పారుపల్లి-లింగన్నపేట గ్రామాల మధ్య ఒర్రెపై రూ.3 కోట్ల 8 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. ఇది పూర్తి కాకపోతే అవతల ఉన్న 10 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఉంది. బ్రిడ్జి పక్క నుంచి తాత్కాలిక రహదారి ఏర్పాటు చేసినప్పటికీ వర్షం పడితే బురదమయమైన ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ మార్గంలో లింగన్నపేట, ఎదుల్లబంధం, సిర్సా, పుల్లగామ, ఆలుగామ, రొయ్యలపల్లి, జనగామ, నందరాంపల్లి, సూపాక, వెంచపల్లి గ్రామాలు ఉండగా, ఈ రోడ్డు ద్వారానే రాకపోకలు సాగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణ పనులు నెమ్మదిగా కొనసాగితే... వర్షాలు పడి తాత్కాలిక రోడ్డు బురదమయమయితే ఎటు వాహనాలు అటే ఉండాల్సిన పరిస్థితి ఎదురుకానుంది. ప్రస్తుతం చిన్న వర్షం పడినా ఈ గ్రామానికి ఆర్టీసీ బస్సు సేవలు నిలిచిపోతున్నాయి.

### వాగు ఉప్పొంగితే బడికి బందే



*మా ఊరికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో మస్తు తిప్పలైతంది. మా బడి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మొత్తం 30 మంది విద్యార్థులం నడుచుకుంట బడికి వెళ్తం. చిన్నపాటి వర్షం పడినా మా ఊరి వాగు ఉప్పొంగుతది. నీళ్లు పారినన్ని రోజులు బడికి బందే. ఎన్నోసార్లు వాగు తగ్గే దాకా ఒడ్డువద్ద గంటల తరబడి ఎదురు చూసినం. ఇకనైనా సార్లు కల్పించుకొని మా ఊరి రోడ్డు తొందరగా పూర్తి చేయాలి. అప్పుడే మా కష్టాలు తీరుతయి.*

**- వైష్ణవి, విద్యార్థిని, రాజారం**

### తొందరగా పనులు పూర్తి చేయాలి



*మా ఊరికి రోడ్డు, బ్రిడ్జి నిర్మించేందుకు ఎప్పుడో నిధులు మంజూరైనయి. అటవీశాఖ అనుమతులు లేక పనులు చేస్తలేరు. దీంతో మా ఊరితో పాటు పక్కనే ఉన్న గ్రామాల ప్రజలు కూడా మస్తు తిప్పల పడుతున్నరు. వాగులు ఉప్పొంగితే గంటల తరబడి ఎక్కడి జనాలు అక్కడే ఉండాల్సి వస్తుంది. రోడ్డు, వాగుల పైన బ్రిడ్జి లేకపోవడంతో మా గ్రామానికి అత్యవసర పరిస్థితులలో 108 అంబులెన్స్ కూడా రాని పరిస్థితి ఉంది. ఇకనైనా సార్లు చొరవ తీసుకొని తొందరగా పనులు పూర్తి చేయాలి.*

**- ఈగం లచ్చయ్య, నక్కలపల్లి**